క్లుప్తంగా

రేపు పాస్టర్ ప్రవీణ్ శాంతి రుధిర యాత్ర



నెహ్రూ నగర్: పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతికి నిరసనగా ఈనెల 30వ తేదీన గుంటూరులో శాంతి రుధిర యాత్ర నిర్వహించనున్నట్లు క్రైస్తవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల రాజు తెలిపారు. శుక్రవారం మిర్చి యార్డు రోడ్‌లో క్రైస్తవ, మైనారిటీ సంఘ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయన మరణం పై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పాస్టర్ జోసఫ్, రాంబాబు, విల్సన్, విద్యాసాగర్, మధు ప్రేమ్ జ్యోతి బాబు, నల్లపు నీలాంబరం, రవి కిరణ్, లీల పాల్గొన్నారు.

కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం

గుంటూరు మెడికల్: నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతి రావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, నేరెళ్ల మాధవరావు, చంద్రశేఖర్, ఈదర శ్రీనివాస రెడ్డి, వై.వి.సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్, సురేష్ జైన్, బజరంగ్ రామకృష్ణ, మందడపు సురేష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

ఏలూరి బ్యాంకు ఖాతాదారుల సమావేశం



కొరిటెపాడు: ఏలూరి బ్యాంకు బ్రాడీపేట శాఖ ఖాతాదారుల సమావేశం శుక్రవారం ముఖ్య శాఖ అధికారి ఎన్.సీతారామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు అందజేసిన బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. రూ.68 నుంచి రూ.81 కోట్లకు 20 శాతం వరకు వ్యాపారం పెరిగిందని వెల్లడించారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ పి.వి.శర్మ మాట్లాడుతూ డెబిట్, యూపీఐ కార్డు సర్వీసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజర్ పి.విజయ ప్రసన్న పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ రూ.1534.27 కోట్ల ఆమోదం కోసం శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు కౌన్సిల్ సెక్రెటరీ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కౌన్సిల్ సమావేశం మందిరంలో 11 గంటలకు తాత్కాలిక మేయర్ షేక్ సజీల అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా



లక్ష్మీపురం: విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. గుజ్జనగుండ్లలోని ఏఈ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆ పార్టీ నగర కార్యదర్శి కె.నళినికాంత్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో ప్రజలపై ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్లు భారం మోపారని ఆరోపించారు. పార్టీ నాయకులు బి.సత్యనారాయణ, బి.ముత్యాలరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బి.లక్ష్మణరావు, కె. శ్రీనివాసరావు, వై.రమణ, ఎ.కళ్యాణి, షేక్ ఖాశీం షహీద్, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

రేపు సాహితీ వసంతోత్సవం

నగరంపాలెం: ఉగాది సందర్భంగా ఈనెల 30న సాహితీ వసంతోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో వసంతోత్సవ గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ వసంతోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగీత విద్వన్మణి ఆర్.సూర్యలక్ష్మి శిష్య బృందంతో విష్ణుసహస్రనామ పారాయణ, గుదిమెళ్ల శ్రీ కూర్మనాథస్వామి పంచాంగ శ్రవణం ఉంటుందని చెప్పారు. సమాఖ్య కార్యదర్శి ఆర్.రాము, టీఎంటీ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ సాయంత్రం ఆరున్నరకు జరిగే సాహితీ సమ్మేళనంలో సుప్రసిద్ధ సినీ గేయ, గజల్ రచయిత రసరాజు, ప్రసిద్ధ రచయిత, కవి యాకూబు, సుప్రసిద్ధ సినీ నటులు కేదార్ శంకర్, హాస్య రచయిత డాక్టర్ పీవీ రామ్‌కుమార్, సంభాషణ రచయిత కె.కృష్ణవేణి, అష్టావధాని సల్లాన్ చక్రవర్తుల సాహిత్ పాల్గొంటారని చెప్పారు.

పన్నుపై అరకొర రాయితీ

- ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ భారం
- పన్ను చెల్లింపునకు 50 శాతమే రాయితీ
- వైఎస్సార్ సీపీ హయాంలో వందశాతం
- కుళాయి బకాయిలు ఇప్పుడే చెల్లించాలంటూ ఒత్తిడి



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: ఇచ్చేది గోరంత గొప్పలు చెప్పుకునేది కొండంత అన్నట్లుగా ఉంది కూటమి ప్రభుత్వ తీరు. 15 శాతం పన్నులు పెంచి నగర ప్రజలపై అధిక భారం మోపిన ప్రభుత్వం వడ్డీ రాయితీని 50 శాతం మాత్రమే ఇచ్చి ప్రజలకు ఏదో మంచి చేసినట్లు ప్రచారం చేసుకుంటోంది. వాస్తవానికి 100 శాతం వడ్డీ రాయితీ ఇవ్వాల్సి ఉండగా కేవలం 50 శాతం మాత్రమే ఇచ్చి ప్రజలపై భారాన్ని మోపింది. మరో పక్క ఏళ్ల తరబడి బకాయిలు ఉన్న కుళాయి పన్నును ఒకే సారి చెల్లించాలని తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో నగర ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ 50 శాతం వడ్డీ రాయితీ పొందడానికి కూడా రెండు రోజుల ముందు ఇచ్చి ఈ నెలఖారులోపు కట్టాలని ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రెండేళ్ల పాటు వరసగా కార్పొరేషన్‌లో పన్ను బకాయిలు వసూలుకు సంబంధించి వంద శాతం వడ్డీ రాయితీ కల్పించారు. ఇది కూడా సుమారు నెల రోజుల పాటు సమయం ఇచ్చే వారు. దీంతో నగర ప్రజలు తమ పన్ను బకాయిలను ఆర్థిక భారం లేకుండా వడ్డీ రాయితీపై చెల్లించేవారు. దీని వలన సుమారు 90 శాతం పన్నులు వసూలు అయ్యేవి. మొండి బకాయిలు వసూలు అయ్యేవి. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఒక అర్ధ సంవత్సరంగా, అక్టోబర్ నుంచి మార్చి వరకు మరో అర్ధ సంవత్సరంగా పరిగణించి పన్నులు వసూలు చేస్తుంటారు. ఈ కాలంలో పన్నులు చెల్లించకపోతే నూటికి రూ.2 చొప్పున వడ్డీ వసూలు చేస్తారు. మరీ మొండి బకాయిలు అయితే ఎక్కువ స్థాయిలో వడ్డీ పేరుకుపోతుంటుంది. అలాంటి వాళ్లు బకాయిలు చెల్లించాలంటే వడ్డీ పెను భారంగా మారుతోంది. అలాంటి వారికి వందశాతం వడ్డీ రాయితీ ఎంతో మేలు చేసి వారు వెంటనే పన్నులు చెల్లించేవారు.

ప్రస్తుతం ఇలా..

గుంటూరు నగరంలో 2,02,788 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి గాను రూ.170.93 కోట్లు డిమాండ్ ఉండగా.. ఇప్పటి వరకు రూ.109.52 కోట్లు వసూలు అయ్యాయి. ఇంకా 61.41 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి నెల చివరి వారంలో నెలాఖరుకు కేవలం మూడు రోజులు మాత్రమే ఉండగా కూటమి ప్రభుత్వం హయాంలో వడ్డీ రాయితీ ప్రకటించారు. అది కూడా కేవలం 50 శాతం మాత్రమే రాయితీ కల్పించారు. దీంతో పన్ను చెల్లింపుదారులకు పెద్దగా కలిసి వచ్చేది కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. 50 శాతం వడ్డీ రాయితీ కూడా మొత్తం బకాయి చెల్లించిన వారికే వర్తిస్తుంది. దీంతో పన్నులు చెల్లించడానికి నగర ప్రజలు విముఖత చూపిస్తున్నారు. అదే 100 శాతం రాయితీ ఇచ్చి ఉంటే ప్రజలు మరింతగా పన్ను చెల్లింపు చేసేవారు నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరేది.

రంజాన్ ఉపవాస ఫలం...

- ఖర్జూరం... అమృతాహారం..



కొబాల్ట్‌పేట ఫలాలను విక్రయిస్తున్న వ్యాపారులు

లక్ష్మీపురం: రంజాన్ మాసం ప్రారంభమై 27 రోజులు పూర్తి అయ్యాయి. ఉపవాస దీక్షను విరమించేందుకు(ఇఫ్తార్)లో ముందుగా ఖర్జూరాలను తీసుకోవడం ఆనవాయితీ. ప్రతి మసీదు, మార్కెట్‌లో వాడవాడతా ఖర్జూరాలు క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. భారత్‌లో పండే ఖర్జూరాలతో పాటు సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, జోర్డాన్ తదితర దేశాలకు చెందిన దాదాపు 50 రకాల ఖర్జూరాలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో అజ్వా, సగాయి, మెడ్‌జాల్, అల్‌బెనా, ఫిట్, క్రాన్, తైబ, కిమియ, హస్నా, కొసర్ ఫర్ట్, పెయింట్ ఖజూర్, రకాలు ముఖ్యమైనవి. రంజాన్ మాసంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షను పాటించడం వలన శరీరంలో శక్తితో పాటు రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుంది. ఆ సమయంలో శరీంపై ఎలాంటి వ్యాధులు దాడి చేయకుండా ఉండేందుకే ఉపవాస దీక్ష విరమణ సమయంలో ఖర్జూరాన్ని తీసుకోవాల్సిందిగా చెబుతారు. వివిధ రకాల ఖజూర్‌లు జిల్లాలో అందుబాటులోకి వచ్చాయి. వీటిలో కిలో రూ.100 పలికే పెయింట్ ఖజూర్ నుంచి కిలో రూ.2700 వరకు పలికే అజ్వా ఖజూర్ వరకు అనేక రకాలు రంజాన్ ఉపవాస దీక్షల కోసం ప్రత్యేకంగా కొలువై ఉన్నాయి.

వారెవ్వా అజ్వా...

ఖర్జూరలో చాలా ఖరీదైన రకం అజ్వా. సౌదీ అరేబియాలో పండే ఈ రకం ఖజూర్ ప్రపంచంలో కెల్లా అత్యంత తియ్యనైన పండుగా చెబుతారు. నల్లటి రంగులో ఉండే అజ్వా ఖజూర్‌లోని విత్తనాలను తొలిగించి, వీటిలో పూర్తిగా బాదం, పిస్తా వంటి డ్రైఫ్రూట్స్‌ను స్టఫ్ చేసి వాటిని తేనెలో తడిపి, వాటిపై అసలైన కుంకుమ పువ్వును వేస్తారు. ఇలా ఎంతో పౌష్టిక విలువలను కలిగిన ఈ అజ్వా ధరలో కూడా చాలా ఘనమైనదే. అజ్వా ఖజూర్ కిలో ప్యాకెట్ ధర సుమారుగా రూ.4 వేల నుంచి అందుబాటులో ఉంటాయి.

నోరూరించే సగాయి...

అజ్వా తరువాత తియ్యదనంలో మేటిగా చెప్పబడే ఖజూర్ రకం సగాయి. దుబాయ్‌లో పండే సగాయి కూడా ప్రపంచ మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న ఖజూర్. ఇవి కూడా కేవలం ఖజూర్‌గానే కాక వీటిలో డ్రైఫ్రూట్స్ స్టఫ్ చేసి కుంకుమ పువ్వుతో కలిపి అమ్ముతారు. సగాయి కిలో సుమారు రూ.5 వేల వరకు ఉంది.

సీనియారిటీ జాబితాల్లో సమస్యలు పరిష్కరించాలి

డీఈఓకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి



డీఈఓ రేణుకకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ విడుదల చేసిన అన్ని కేడర్లకు సంబంధించిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాల్లో నెలకొన్న అసంబద్ధాలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జాబితాల్లోని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకకు అందజేశారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ డీఎస్సీల వారిగా విడుదల చేసిన మెరిట్ సీనియారిటీ జాబితాల్లో మునిసిపల్, కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలో నెలకొన్న అసంబద్ధాలను సరిచేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్స్‌తో పాటు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాలో వరసక్రమం లోపించిందని, ఫీడర్ కేడర్ ఎస్జీటీల సెలక్షన్ జాబితాలోనూ లోపాలున్నాయని తెలిపారు. డీఎస్సీ-2008 ద్వారా పెద్ద సంఖ్యలో నియమితులైన ఎస్జీటీలతో పాటు మిగిలిన వారు ఉద్యోగ హామీపత్రాలు పొందారని పేర్కొన్నారు. అయితే విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు బదులుగా, హామీ పత్రాలు పొందిన అభ్యర్థులను మెరిట్ జాబితాలో ముందు వరసలో ఉంచడం అన్యాయమని ఆరోపించారు. 2008లో డీఎస్సీ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విధుల్లో చేరిన వారందరికీ కామన్ జాయినింగ్ డేట్ ఇచ్చి సీనియర్లకు న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుతం విద్యాశాఖ మెరిట్ సెలక్షన్ లిస్టులు విడుదల చేసిందని, వాటి స్థానంలో మెరిట్ కమ్ రోస్టర్ సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని విన్నవించారు. అభ్యంతరాలను సమర్పించే గడుగు పొడిగించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో ఎస్‌ఎస్‌ఎన్ మూర్తి, కె.రమేష్, జి.దాస్, చక్కా వెంకటేశ్వర్లు, కిషోర్ షా ఉన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి



పట్నంబజారు: వక్ఫ్‌బోర్డు బిల్లును నిరసిస్తూ శనివారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా విజయవాడలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి ముస్లింలు పెద్ద సంఖ్యలో, పార్టీలకతీతంగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. వక్ఫ్‌బోర్డు భూములు, ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ముస్లిం మైనార్టీలపై ఉందని గుర్తించాలన్నారు. మైనార్టీలు భారీ సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తొమ్మిది మందికి ఉగాది పురస్కారాలు ప్రదానం



ఉగాది పురస్కారాల అందుకున్న వారితో జిల్లా జడ్జి పార్థసారథి తదితరులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి(హైదరాబాద్), ఆరాధన ఆర్ట్స్ అకాడమీ(గుంటూరు), నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తోన్న ఉగాది పురస్కార ప్రదానోత్సవం శుక్రవారం రెండో రోజు కొనసాగింది. వెలువోలు నాగరాజ్యలక్ష్మి(సాహిత్యం), బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి(న్యాయవాది), మేకల మోహనరావు(విద్యా), వైద్యులు బండ్ల రామ్‌చంద్(వైద్యం), బొర్రా నరసయ్య(నాటక రంగం), వడ్డమాను రంగమణి(కూచిపూడి), రామరాజు ప్రేమ్‌కుమార్(సంగీతం), బండారు నాగమణి, చెరుకూరి సాంబశివరావు(కళా రంగం)లను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి, నాలుగో జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు, ఏపీ క్రటేరియట్ లా డిపార్ట్‌మెంట్ అదనపు కార్యదర్శి డాక్టర్ లంకా లక్ష్మీనారాయణ, అజో విభో ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ, ఆలయ కమిటీధ్యక్షులు సీహెచ్ స్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వర రావు ప్రసంగించారు. అనంతరం శ్రీకృష్ణా ఆర్ట్స్ థియేటర్(ఢిల్లీ) ఆధ్వర్యంలో బర్రె సత్యనారాయణ రచించి, ఢిల్లీ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన అనశ్వరం నాటిక సందేశాత్మకంగా సాగింది. ఆలాపన వెంకటేశ్వరరావు ఆలపించిన సినీ, భక్తిగీతాలు అలరించాయి. కళావిపంచి అధ్యక్షులు బొప్పన్న నరసింహారావు, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు డి.తిరుమలేశ్వర రావు, నటరత్న ఎన్టీరిషత్ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణ పాల్గొనగా, ఎ.వి.కె.సుజాత వ్యాఖ్యతగా వ్యవహరించారు. జి.మల్లికార్జునరావు, ఎ.విశ్వనాథబాబు, సాంబశివరావు, సయ్యద్ జానీబాషా, జీవీ శంకర్, భంగి శివశంకరశాస్త్రి, నడింపల్లి వెంకటేశ్వరరావు, డి.తిరుమలేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నాటకోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శుక్రవారం రాత్రి డాక్టర్ మాగంటి మురళీమోహనరావు నాటకోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిం చారు. వచ్చే నెల 13 నుంచి 16వ తేదీ వరకు గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, వై.కె.నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ సంయుక్తంగా కొరిటెపాడులోని ఎల్.వి.ఆర్.అండ్ సన్స్ క్లబ్, రీడింగ్ రూమ్‌లో నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, నాలుగో జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు, ఏపీ సెక్రటేరియట్ లా డిపార్ట్‌మెంట్ అదనపు కార్యదర్శి డాక్టర్ లంకా లక్ష్మీనారాయణ, అజో విభో ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ, మేకల మోహనరావు పాల్గొన్నారు.

నైట్ స్ట్రీట్ ఫుడ్ జోన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గళ్లా మాధవి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో నైట్ స్ట్రీట్ ఫుడ్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఫుడ్ జోన్ ఏర్పాటుకు గుర్తించిన ప్రాంతాల్లో స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాలు, సూచనలు తీసుకొని త్వరలో ఒక ప్రాంతాన్ని నిర్ణయిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, అధికారులతో కలసి అరండల్ పేట 4వ లైన్, పిచ్చుకలగుంట ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నైట్ స్ట్రీట్ ఫుడ్ జోన్ల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, ఇప్పటికే బ్రాడీపేట 4వ లైన్‌ని పరిశీలించినట్లు వివరించారు. అరండల్ పేట 4వ లైన్, పిచ్చుకల గుంట లైన్‌లు కూడా ఫుడ్ జోన్ల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటాయన్న సూచనలకు అనుగుణంగా పరిశీలించామని చెప్పారు. ప్రధానంగా నివాస ప్రాంతాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నగరంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో ప్రజలు కోరుతున్నారని, అందుకు అనుగుణంగా అనుకూలమైన ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తున్నామన్నారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభానికి ముందే ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం బ్రాడీపేట అరండల్ పేటల్లో రోడ్ల ఆక్రమణలను తొలగించుకోవడం, అవసరమైన ప్రాంతాల్లో విస్తరణ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యటనలో కార్పొరేటర్ ఎం.శ్రీవల్లి, డీఈఈ రమేష్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు స్టేక్ హోల్డర్స్‌తో ప్రత్యేక సమావేశం

గుంటూరు నగరంలో నైట్ స్ట్రీట్ ఫుడ్ జోన్ ఏర్పాటుపై స్టేక్ హోల్డర్స్ సూచనలు, సలహాలు కోరుతూ శనివారం సాయంత్రం 4 గంటలకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశామని, నగరంలోని స్టేక్ హోల్డర్స్ సమావేశానికి హాజరై ఫుడ్ జోన్ ఏర్పాటుపై తమ సూచనలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

కంప్యూటర్ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు



గుంటూరు ఎడ్యుకేషన్: కంప్యూటర్ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని జేకేసీ కళాశాల పాలకవర్గ సభ్యుడు జాగర్లమూడి వేమన కుప్పుస్వామి పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో కంప్యూటర్ రంగంలో నూతన అధునాతన పోకడలపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిచాలనే లక్ష్యంతో ఎన్నో విప్లవాత్మక మార్పులను చేస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, సమాజ అవసరాలకు తగినట్లుగా విద్యార్థులను అనేక రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, హెచ్‌సీఎల్ టెక్ జనరల్ మేనేజర్ బి.సురేష్‌బాబు, సదస్సు డైరెక్టర్ ఆచార్య యలవర్తి సురేష్‌బాబు, డాక్టర్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలను పట్టించుకోని ప్రభుత్వాలు: సీపీఐ

లక్ష్మీపురం: రాష్ట్ర, దేశ ప్రజల బాగోగుల్ని పట్టించుకోలేని ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అన్నారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్యలింగం భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు అధికారంలో ఉంటే పేద ప్రజలు కనబడరని విమర్శించారు. తెలంగాణ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు. పోస్టాఫీసులు, బ్యాంకుల్లో ఆధార్ అనుసంధానం కోసం ఈనెల 31వ తేదీ వరకు ఖాళీ లేదు అని బోర్డులు పెట్టారని, పోస్ట్ ఆఫీసుల్లో సర్వర్లు పనిచేయడం లేదని చెప్పారు. మరోవైపున ప్రభుత్వం ఈ నెల ఆఖరి కల్లా అనుసంధానం చేయకపోతే వచ్చే నెల నుంచి రేషన్ కార్డులు ఉండవని చెప్పడం సమంజసం కాదన్నారు. ఆధార్ కార్డు అనుసంధానం కార్యక్రమాన్ని ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి పై సమగ్రమైన విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు మేడా హనుమంతరావు, గని, చైతన్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సైన్స్ పోటీల్లో ప్రతిభ చూపిన సుమేధ హైస్కూల్ విద్యార్థులను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అభినందించారు. యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025 రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించిన విద్యార్థులను శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు నగరానికి చెందిన సుమేధ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రసాద్, కార్యదర్శి బి.ప్రసాద్, సభ్యులు టీఆర్ రమేష్, అక్బర్, పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాదాత పుట్టగుంట చిరస్మరణీయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: పేద కుటుంబాలకు విద్యాదాత పుట్టగుంట వేణుగోపాలరావు చిరస్మరణీయుడని కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య అన్నారు. కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ సహ వ్యవస్థాపకుడు, ఎన్నారై డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు సంస్మరణ సభ శుక్రవారం జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో నిర్వహించారు. ఈసందర్భంగా బసవపున్నయ్య మాట్లాడుతూ 1934లో రేపల్లె సమీపంలోని నల్లూరులో జన్మించిన పుట్టగుంట వేణుగోపాలరావు ఉన్నత విద్యాభ్యాస అనంతరం కెనడాకు వెళ్లి అక్కడ స్థిరపడ్డారని తెలిపారు. వివిధ రంగాల్లో పని చేసి, ఉద్యోగ విరమణ అనంతరం చదువుకునే రోజుల్లో తాను పడిన కష్టాలను గుర్తు చేసుకుని, ఇక్కడి విద్యార్థులకు చదువుల కోసం ఆర్థిక సహకారాన్ని అందించాలనే ఆశయంతో అమెరికాలో స్థిరపడిన జాష్టి వెంకటేశ్వర్లుతో కలిసి అంతర్జాతీయ విద్యార్థి సంక్షేమ సంఘాన్ని స్థాపించి 25 ఏళ్ల పాఠశాల స్థాయి విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారని చెప్పారు. ఇదే క్రమంలో కళాశాల విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు 2003లో కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి గత 22 ఏళ్లుగా ఉపకార వేతనాలు అందజేశారని వివరించారు. ఇప్పటి వరకు సొసైటీ ద్వారా రూ.ఆరు కోట్ల ఉపకార వేతనాలు పంపిణీ చేయడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించిన వేణుగోపాలరావు సొసైటీకి వ్యక్తిగతంగా రూ.కోటి అందజేశారని తెలిపారు. గత జనవరిలో జరిగిన రూ.52 లక్షల ఉపకార వేతన పంపిణీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, తిరిగి కెనడా వెళ్లిన వేణుగోపాలరావు ఈనెల 14న అక్కడ మరణించడం బాధాకరమన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, పాలడుగు లక్ష్మణరావు, నామినేని కోటేశ్వరరావు, వడ్లమూడి గోవర్ధనరావు, తదితరులు పాల్గొని వేణుగోపాలరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

ధర్నా చేస్తున్న చిరు వ్యాపారుల తరలింపు

లక్ష్మీపురం: రోడ్డుకు ఇరువైపుల తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులను నగరపాలక సంస్థ ఆక్రమణ దళం బృందం వాహనాలను తొలిగించే క్రమంలో చిరు వ్యాపారులు ఆక్రమణ దళం వాహనం ముందు శుక్రవారం బైఠాయించి ధర్నా చేశారు. ఆందోళనకారులను పట్టాభిపురం పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ధర్నాకు అనుమతి లేదని చెప్పారు.

డాక్టర్ విజయను సన్మానించిన ఫిజియోథెరపిస్టులు



గుంటూరు మెడికల్: ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్(ఐఎస్‌ఏ) అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన గుంటూరుకు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్, లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ న్యూరోసైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ పమిడిముక్కల విజయను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాపట్ల వెంకట హరికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ విజయ ఏపీ నుంచి జాతీయ స్థాయి పదవి దక్కించుకున్న మొట్టమొదటి మహిళగా రికార్డు సృష్టించారన్నారు. పక్షవాతం నుంచి విముక్తి కల్పించి స్ట్రోక్ బాధితుల ప్రాణ రక్షణే ధ్యేయంగా ఉమ్మడి ఏపీలో మొట్టమొదటిసారిగా స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారని చెప్పారు. ఐఎస్‌ఏ అధ్యక్ష పదవి అధిరోహించి జిల్లాపేరును దేశ వ్యాప్తంగా మారుమోగేలా చేశారన్నారు. భవిష్యత్‌లో మరెన్నో పదవులు అధిరోహించాలన్నారు. భవిష్యత్‌లో స్ట్రోక్ మేనేజ్‌మెంట్‌పై కార్యక్రమాలు చేసేందుకు తమవంతు పాత్ర పోషిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ షేక్ సుభాని, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మాధవి, డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ దయాకర్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ గ్రేస్, డాక్టర్ వినుకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒత్తిడితోనే అధికంగా మానసిక సమస్యలు

ఎన్వీయూ పూర్వ వీసీ శ్రీకాంత్‌రెడ్డి



సావనీర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, ఆలపాటి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రస్తుతం సమాజంలో ఒత్తిడితో కూడిన జీవన విధానం వలన ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలకు గురవుతున్నారని ఎన్వీయూ పూర్వ వీసీ ఆచార్య వి. శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సాంబశివపేటలోని సెయింట్ జోసఫ్ మహిళా బీఈడీ కళాశాల, గ్లోబల్ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్(జీసీపీఏ) సంయుక్తంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహిరచారు. 'సైకోసోషల్ కాంపెటెన్సీస్ ఫర్ గ్లోబల్ యూత్' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను తట్టుకుని, సంతోషంతో కూడిన ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడంలో కుటుంబ వ్యవస్థ ముఖ్యమన్నారు. జీసీపీఏ అధ్యక్షురాలు డాక్టర్ డి.సరోజ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సామాజిక, మానసిక పరిస్థితులకు అనుగుణంగా యువతను సక్రమమైన మార్గంలో పయనింపచేయడంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు సదస్సు దోహదం చేస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి మాట్లాడుతూ పరిశోధకులు 25 పరిశోధన పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. సదస్సులో గుంటూరు జేఎంజే ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ విజయమేరీ, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరీసమ్మ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ ఎ.రోజిలీన్, అసోసియేట్ ప్రొఫెసర్ బి.శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి, సి.గ్రేస్ ఇందిర, డాక్టర్ కె.విజయ కుమారి పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న జీఎంసీ ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు

నెహ్రూ నగర్: ఆస్తి పన్ను చెల్లించటానికి మూడు రోజులే గడువు ఉన్న నేపథ్యంలో ఈ నెల 30,31 తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగ సెలవు రోజులైనప్పటికీ జీఎంసీ ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు పని చేస్తాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం రాయితీని వినియోగించుకొని పన్ను చెల్లించడానికి 3 రోజులే గడువు ఉన్నందున, సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లించడానికి వచ్చే వారికి వీలుగా ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కౌంటర్ల పెంపు చేయడంతో పాటు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. వడ్డీ రాయితీతో పన్ను చెల్లించడానికి చివరి అవకాశం కనుక ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లోని ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లలో పన్ను చెల్లించి, నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. శుక్రవారం రూ.2.50 కోట్లు పన్ను వసూలు అయినట్లు వివరించారు.